

# నరకానికొచ్చిన బాపు

## యల్లాంశెట్టి శాయి

అనగనగా ఓ రోజు. వెన్నెల్లో పార్వతీ పరమేశ్వర్లు ఝుమ్మని కబుర్లుచెప్పు కొంటూ మబ్బుల్లో షికారుకి బయల్దేరేరు. వెళ్తోంటే భూలోకంనుంచి "దేవా! నాకు చావునెందుకు ప్రసాదించవ్!" అన్న గొంతు దీనంగా వినిపించింది. పార్వతి

ఒరిజినల్‌గా జాలిమనిషి. అంచేత ఆ గొంతులోని మెలొడీకి తెగ జాలిపడిపోయింది.

"నాథా! ఎవరిదా వ్యథ? ఏమా కథ?" అనడిగింది భర్తని. ఆవిడకు ప్రాసలంటేకూడా ఇష్టం!

"గోపాలం అనీ ఓ సగటుమనిషి! చావు ప్రసాదించమని రోజూ నన్ను ప్రార్థిస్తూంటాడు..." అన్నాడు శివుడు.

"పోనీ పాపం. అంతగా ప్రాధేయపడుతున్నాడుగా, ఇచ్చేయకూడదూ?"

"ఏమిటి బావా?"

"అవును! ఏం?"

"మరేంలేదు! సాధారణంగా కథల్లో ఎప్పుడూ శివుడు వరాలిచ్చినట్లే రాస్తూంటారుకదా? చావు నా డిపార్ట్‌మెంట్ కాదేమోనని..." అంటూ నసిగాడు శివుడు.

"ఏంఫర్లేదులేస్తూ! అత నంతగా బతిమిలాడుతోంటే ఏమిటా బడాయ్?" అంటూ కోప్పడబోయింది.

"సరే!" అన్నాడు శివుడు.

* * *

గోపాలం పొద్దున్నే లేచి అరిగిపోయిన బ్లేడుతో ఎదిగిపోయిన గడ్డాన్ని రెల్లుగడ్డిలా కోసవతలపారేస్తున్న సమయంలో తలాకిటి తలుపు తట్టిన చప్పుడయింది.

"ఇంతవరకూ ఏ అప్పులాడూ ఈ టైముకిరాలేదే!" అని హోరున ఆశ్చర్యపడుతూ తలుపుతెరచి ఎదురుగ్గా కనిపించిన ఆకారాన్ని చూసిదడుసుకున్నాడు. వళ్ళంతా గగుర్పొడిచేసింది.

"ఎవర్నువ్వు" అనబోయి "ఎవరు మీరు?" అనేశాడు.

"చావుని!" అందా ఆకారం.

"చావా?"

"అవును! నిన్ను తీసుకెళ్ళడానికి వచ్చాను. ఇక మనంవెళ్దామా?" లోపలికి తోసుకొస్తూ అందా ఆకారం.

"బుజుబుజు..."అన్నాడు గోపాలం ఖంగారుగా.

"రోజూ చావుకావాలని అడ్డమయిన దేవుణ్ణి ప్రార్థిస్తూ తీరా నేనొచ్చాక ఆ సణుగు దేమిటి?" కోపంగా అడిగింది చావు.

"అబ్బే! రావడాని కిష్టంలేకకాదు. నిన్న ఫస్టుతారీకు. జీతాలొచ్చినయి. అంచేత అదీ, ఇదీ, తేవాల్సిన పనులు చచ్చేన్ని ఉంటాయి. ఇవాళ చావడానిగ్గూడా టైముండదు.పనులన్నీ పూర్తిచేసుకొని రేపుదయం వెళ్దాం. మీరు నుంచునే ఉన్నారేం? కూర్చోండి..."

చావు పడక్కుర్చీలో కూలబడింది.

"ప్లీజ్! కాదనకండి! సరిగ్గా ఇరవైనాలుగ్గంటలు టైమివ్వండిచాలు! పన్లన్నీ అయిపోతే నా ఆత్మకు చాలా తృప్తిగా ఉంటుంది. లేపోతే దయ్యమై మిమ్మల్నే పట్టుకొన్నా పట్టుకోవచ్చు..."

"సరే, త్వరగా అఘోరించు! నీ పెళ్లాం బిడ్డలేమయ్యారూ?"

"ఎందుకూ వాళ్ళనికూడా తీసు కెళ్తావా ?"

చావు కోపంగాచూసింది. గోపాలం ఖగారుపడ్డాడు.

"ఉన్నారులే. పక్కగదిలో నిద్ర పోతున్నారు. ఈ గదిలో ఇద్దరికంటె ఎక్కువమంది పట్టరు. మీరోనిమిషం లేచి నుంచుంటే ఆ కుర్చీ, మడతబెట్టి నేను బయటకు దారిచేసుకొంటాను..."

అంటూ చావు లేవగానే అతి లాఘవంగా కుర్చీని మూలకుమడిచి బయటకు నడిచాడు గోపాలం.

"ఈ ఇల్లేమిటి ఇంత ఇరుగ్గా అఘోరించింది ?" విసుగ్గా అడిగింది చావు మళ్ళీ కుర్చీవేసుకొని కూర్చుంటూ.

సగటుమనుషుల ఇళ్ళిలాగే ఉంటయి. అస్సలు ఒరిజినల్‌గా ప్లానులో పందుల ఫారమ్ కోసమని డిజైన్ చేశారుట తీరా సగంకట్టాక ఓనరు చచ్చిపోయాడు. వెంటనే కొడుకులు దాన్ని మనుషుల కిచ్చేశారు అద్దెకు..."

గోపాలం ముఖం కడుక్కొని తిరిగి వచ్చాడు. లోపలి గదిలోకెళ్ళి ఓ కిరసనాయిలు టిన్నూ, సంచీ తీసుకొచ్చాడు.

"పద ! అలా రేషన్‌దుకాణంకి పోయొద్దాం..." అన్నాడు చావుతో.

"స్నానం చెయ్యవూ ?"

"గోపాలం విరగబడినవ్వేశాడు.

"అబ్బ ఏం జోకండీబాబు.మీ తరహా చూస్తుంటే ప్రతిరోజు స్నానం చేయాలనేట్లున్నారే..."

"అదేమిటి? రోజూ స్నానం చెయ్యవూ?"

"ఇంకానయం నెలకోరోజు చేస్తే రోజూ చేసినంత ఫలం..."

"ఎందుకని?"

"పంపు నీళ్ళు మీ బాబుగాడిసొమ్మనుకున్నారా? మీ వీధి పంపులో రాత్రి పన్నెండు తరువాత తెల్లారి అయిదింటి లోపే నీళ్ళొస్తయి. క్యూలో మనవంతు వచ్చే సరికి రెండు బిందెలు కంటెఎక్కువ నీళ్ళు దొరకవు. అవేమో వంటకే చాలవ్..."

ఇద్దరూ ఇంట్లోంచి బయటికొచ్చారు.

"అబ్బ!పాడువాసన..."అంది చావు ముక్కు మూసుకుంటూ అక్కడే నుంచుండిపోయి.

"ఎక్కడ ... నాకేమీ వాసన అనిపించటంలేదే!" అన్నాడు గోపాలం ఆశ్చర్యపోతూ.

"దౌర్భాగ్యుడా, ఈ మురిక్కాలవ, సారీ—నది, అంత దరిద్రపు వాసన కొడుతుంటే, ఎక్కడంటావేమిటి ?" మండిపడుతూ అంది చావు.

"ఓహ్, ఇదా..."విరగబడినవ్వాడు గోపాలం.

"ఆంధ్రుల సంగతి మీకింకా తెలీదనుకొంటాను. మురిగ్గుంటలు చుట్టూలేందే వాళ్ళుండలేరండీ బాబూ! ఉదాహరణకు

ఆంధ్రాలో ఏ ఊరయినా చూడండి, ఒక్కదానికి కూడా అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ లేదు. అందాకా ఎందుకూ. నా మటుకు నాకు ఈ వాసనలేకపోతే భోజనంకూడా సయించదు..."

ఇద్దరూ నడిచి మెయిన్‌రోడ్డుమీద కొచ్చారు.

అక్కడ రెండుదుకాణాల ముందు మైలుపొడుగు 'క్యూ' లున్నాయి.

ఆగిపోయి "చావుగారూ' అన్నాడతను.

"ఏమిటి, మళ్లీ ఆగావ్?" కోపంగా అంది చావు.

"మనంఇరవై నాలుగ్గంటలవ్యవధిలో పన్లన్నీ పూర్తిచేసుకోవాలంటే మీరొక చిన్నపన్జెయ్యాలి. మీరు కిర్సనాయిల్ క్యూలో నుంచోండి. నేను పంచదార క్యూలో నిలబడతాను... ఏమంటారు?"

"ఇది 'క్యూ'యా లేక చిన్నాపురం దాంతాడా?"

"ఖచ్చితంగా 'క్యూ' యేనండి! ఎంచేతంటే మొన్న ఒకాయన దాంతాడు తీసుకెళ్తూ కొలిచి చూశాడు. 'క్యూ'యే పెద్దదిగాఉంది..."

చావు చిరాకుగా ముఖంచిట్లించి కిర్సనాయిలు డబ్బా తీసుకెళ్ళి క్యూలో నుంచుంది.

క్యూలో సగందూరం వచ్చేసరికి మధ్యాహ్నం ఒంటిగంటయి పోయింది. చావుకి వళ్ళంతా చెమటలుకారుతున్నాయి. వేడిగా కాలిపోతోంది. దీనికంతకూ కారణమయిన గోపాలంవంక కోపంగా చూసింది.

"ఒక్క రోజు కే అలాఅయిపోతే ఎలా? ఇలాంటివి, ఆఫీసులో పన్జేసొచ్చి రోజుకి రెండుక్యూల్లో కాపరం చెయ్యాలి మేము" అన్నాడు గోపాలం.

"నోర్మూసుకో!" అంది చావు.

ఇద్దరూ క్యూలోంచి బయటకొచ్చేసరికి సాయింత్రం మూడయింది.

చావు ముఖమంతా జేవురించి పోయింది.

"ఆ దుకాణంవాడిని చంపేస్తాను" అంది కోపంగా.

"ఎందుకూ?" అడిగాడు గోపాలం.

"నా వరకూ వచ్చాక స్టాక్ అయిపోయిందంటున్నాడు..."

ఓస్ అంతేగదా...పోనీలే పద..."

ఇద్దరూ ఇల్లు చేరుకున్నారు


"కొంచెం మంచినీళ్లియ్యి!" అంది చావు.

"ఇప్పుడు తాగితేమళ్ళీ రాత్రికుండవ్. అందుకు వప్పుకొనేట్లయితే ఇస్తా!" అంటూ లోపలికెళ్లి గ్లాసులో సగానికి తీసుకొచ్చి ఇచ్చాడు.

సగంతాగి కెవ్వున కేకవేసి ఎగిరి పడింది చావు.

"ఏమయింది ?" అడిగాడు గోపాలం.

నీళ్ళల్లో ఏమో పురుగులున్నాయి."




అంది వాంతయేట్లు ముఖం పెట్టి. గోపాలం గ్లాస్ అందుకొని చూశాడు.

"అరె ఆశ్చర్యంగా ఉందే - ఇవేవో క్రొత్తరకం పురుగులొచ్చినయి ఈసారి. చిన్నిముండలు - చూడు ఎంతచక్కగా ఈదుతున్నయో...ఆ మధ్యన వరుసగా పదిహేనురోజులు తెల్లని పురుగులొచ్చి నయి గాని వాటికస్సలు ఈతరాదు..." అన్నాడు సంతోషంగా.

"హు!" అంది చావు ఇంకేమనాలో తెలిస్చావక. "అసలు మంచి నీళ్ళలో పురుగులు రావటమేమిటి?"

"బావుంది. ఫ్రీగా వచ్చేనీళ్ళలోపురుగులు రాపోతే సొరచేపలొస్తాయేమిటి? అస్సల్సంగతేవిటంటే మా ఊరి మున్సిపల్ ఆఫీస్ పక్కనే ఒక 'జూ' ఉంది. అంచేత మున్సిపాలిటీ సప్లయ్ చేసే నీళ్ళలో పురుగులు వస్తున్నయ్యేమోనని మా అభిప్రాయం—అది సరేగాని ఆలా పోయొద్దాంపద..."

"మళ్ళీ ఎక్కడికి?"

"పచారీ దుకాణాలకెళ్ళి వెచ్చాలు తీసుకొద్దాం ... లేపోతే పెళ్ళాం పిల్లలు పస్తుపడుకోవల్సిందే..."

మాట్లాడకుండా అతని వెనుక బయల్దేరింది చావు.

సగందూరం నడిచేసరికి సినిమా హాల్స్ దగ్గర రోడ్డుమీద పెద్దగుంపు ఏవో నినాదాలుచేస్తూ కనిపించింది.

సెంట్రల్ రిజర్వ్ పోలీస్వచ్చి చేరు కొందక్కడికి.

"ఏమిటా గొడవ?" అడిగింది చావు.

ప్రదర్శనలను నిషేధించిందట

ప్రభుత్వం. అందుకు నిరసనగా ప్రదర్శన జరుపుతున్నారు ... " అన్నాడు గోపాలం.

అంటూండగానే గుంపులోనుంచి పోలీసులమీద రాళ్ళ రువ్వటం మొదలయింది.

"పద! ఇంకొన్ని క్షణాలుంటే మనని కాల్చిపారేస్తారు పోలీసులు ... " అన్నాడు గోపాలం సినిమా హాలువేపు పరిగెడుతూ.

"వాళ్ళు రాళ్ళేస్తుంటే మననెందుకు కాలుస్తారు?"

"అది వాళ్ళకీ తెలీదు - ఆ తరువాత తెల్సుకొనేందుకు మనమూ ఉండం."

ఇద్దరూ మిగతా జనం కొంత మందితోపాటు హాల్లోకి దూరి నుంచున్నారు. తెలుగు మాట్నీ ఆడుతోం దందులో.

ఒక అయిదేళ్ళ పిల్లాడు, వాడుపుట్టక ముందే విడిపోయిన తల్లిదండ్రుల్ని ముసలిముండావాడిలా చాదస్తపు వాగుడు వాగి కలిపిపారేస్తున్నాడు.

"ఈ దరిద్రపు సిన్మాలో ఒక్క క్షణం కూడా ఉండను... పోలీసుల చేతిలో చచ్చినా నాకు సంతోషమే-పద బయటకుపోదాం..." అంది చావు.

ఇద్దరూ హాల్లోంచి బయటకొచ్చేరు. అప్పటికే గుంపుమీద 'ఫైరింగ్' అయిపోయింది. మామూలుగానే ఈ అల్లరితో ఏరకంగానూ సంబంధంలేని ఓ కిల్లీకొట్టువాడు ఫర్లాంగు దూరంలో ఇంట్లో టీ తాగుతున్న ఓ పెద్దమనిషి, వాళ్ల కాంపౌండ్‌లోనే ఇసుకలో ఆడుకొంటున్న ఓ చిన్న పిల్లవాడు చనిపోయారు.

చావూ గోపాలం ఈసంగతి వింటూండగానే వీపు పగిలేట్లు లాఠీదెబ్బ పడింది. వీపుమీద. వెనుక నలుగురు పోలీసులు మళ్ళీలాఠీ ఎత్తుతున్నారు రెండో ఇన్‌స్టాల్‌మెంట్ వీపుమీద 'పే' చెయ్యడానికి. ఇద్దరూ అక్కడినుంచి మార్కెట్‌వరకూ ఖంగారుగా పరుగెత్తారు.

"అబ్బ! వీపంతా పచ్చిపుండులా నెప్పెడుతోంది!" అంది చావు


"అవును...''అన్నాడు గోపాలం.

''ఆ దుకాణాల్లో అవేమిటి ఆకాశాన్నంటుతున్నయి?" అడిగింది చావు ఆశ్చర్యంగా.

"అవి ధరలు— అన్నివస్తువుల ధరలూ ఆకాశాన్నంటుతున్నయ్యిప్పుడు'' అన్నాడు గోపాలం.

జీతమంతా పెట్టి ఓ చిన్నసంచిలో సగానికి వెచ్చాలు తీసుకుని తిరిగి ఇంటికి బయల్దేరారు. బస్ స్టాండులో అరగంట సేపు నుంచున్న తర్వాత ఎవరోచెప్పారు బస్ వర్కర్స్ స్ట్రైక్ చేస్తున్నారంట- అందుకని బస్సులు నడవ్వట.

ఇద్దరూ నడిచి ఊరిబయట తేలిగ్గా




ఉంటుందని శ్మశానాల ప్రక్కనే కట్టి ఉన్న హాస్పిటల్ చేరుకున్నారు.

"మళ్ళీ ఇక్కడేమిటి?"

"మా చంటాడికి జ్వరం - ఆర్నెల్లనుంచీ-మందు తీసుకోవాలి..."

"ఆర్నెల్లనుంచీ జ్వరంగా ఉంటే ఇప్పుడా మందుతీసుకోవటం?"

"ఇప్పుడేం ఖర్మ. ఆరునెలల్నించీ ఇక్కడే మందు తీసుకెళ్తున్నాను. ఇంతవరకూ తగ్గలేదు..."

"రోజూ ఈ క్యూలో నుంచోవాల్సిందేనా?"

"చచ్చినట్లు..."

రెండుగంటల తర్వాత సీసా పట్టుకుని బయటకొచ్చాడు గోపాలం.

"సీసాలో ఆ నీళ్ళెందుకూ?"

"ఛట్ — నీళ్ళుకాదు-మందే అది. కాపోతే ఓచుక్కనీళ్ళు కల్సినయ్యన్నాడు కాంపౌండరు..."

ఇలాంటి మందు తాగితే ఆర్నెల్లేం ఖర్మ. ఆ రేళ్ళయినా జబ్బు నయం కాదు..." అంది చావు.

ఇద్దరూ ఇంటివేపు నడవసాగేరు.

ఉన్నట్లుండి ధబ్ మని చప్పుడయింది.

ఇద్దరూ బోర్లాపడిపోయారు. ఇద్దర్నీ గుద్దిన లారీ సడెన్ బ్రేకుతో ఆగిపోయింది.

"ఇంటిదగ్గర తిరిగి రామని చెప్పి బయల్దేరారా?— వెనక్కి చూసి ముందుకి నడవడం తెలీదూ? పిచ్చిసన్నాసుల్లారా?"

మళ్ళీవేగంగా వెళ్ళిపోయింది లారీ.

చావుకి బాగా దెబ్బతగల్టంచేత ఓ పట్టాన లేవలేకపోయింది.

గోపాలం చేయి అందించి లేపాడు.

"ఎవరూ మనకి సహాయం చెయ్యడానికి రారేం?"

''ఇక్కడ ప్రతి అయిదునిముషాలకీ ఓ జత కార్లకిందా లారీలకిందా పడి వీఁయితే లేచి పోతూంటారు. అంచేత ఎంతమందికని సహాయం చేస్తారు?"

''మనం ఫుట్‌పాత్ మీదనడిస్తే వాడు గఁద్దేవాడుకాదు...'' అంది చావు ఫుట్‌పాత్ కోసం వెతుకుతూ.

"బావుంది. మనం నడుస్తున్నది ఫుట్‌పాత్‌మీదే—కాకపోతే ఈ ఊళ్ళో ఫుట్‌పాత్‌లకీ, రోడ్లకీ తేడా ఆట్టేలేకపోటం మూలాన లారీవాళ్ళు పొరపాటుపడుతూంటారెప్పుడూ!''

అతి కష్టంమీద మూలుగుతూ ఇల్లు చేరుకున్నారిద్దరూ.

ఇంట్లోఁచి ఏవో సైరన్లు కూసినట్టు శబ్దాలు వినిపించసాగాయి.

''ఆ సైరన్లేమిఁటి? ఇఁటివెనక ఏమయినా ఫ్యాక్టరీలున్నయ్యా?" అడిగింది చావు రెండుచేతుల్తో చెవులుమూసుకుని.

''సైరన్లు కాదహ— మా పిల్లలు—ఆకలికి ఆగలేక ఏడుస్తున్నారు.ఇప్పుడు వండిపెట్టాలి వాళ్లకు...''

రాత్రి పదకొండింటికల్లా అంతా సద్దుమణిగిపోయింది.

గోపాలం ఓ ప్లేట్లో రొట్టెలుతీసుకొచ్చి చావుముందుంచేడు.

"కొంచెం ఫలహారం తీసుకోండి—బాగా ఆకలిగా ఉఁటుంది మీకు..."

''నీ భార్య దుప్పటి కప్పుకుందేం? చలిజ్వరమా?'' అడిగింది చావు.

"అదేంకాదండీ! దానికి పెళ్లయింతర్వాత ఒక్క చీరకూడా కొనలేకపోయాను—చివరకు ఒక్క చీరే మిగిలింది-అది ఉతికి, ఆరేవరకూ దుప్పటి కట్టుకొంటుంది—ఇంకెంత కాలంలెండి? ఒక్కనెలే ఈ అవస్థ!

''తరువాత? చీరెలు కొంటున్నావా?"

'అబ్బే! నేనేం లక్షాధికారిననుకున్నారా? పెళ్ళానికి చీరెకొనడానికి—ఇంకొక్క నెలతో—ఉన్న చీరెకూడా చిరిగిపోతుంది. తరువాత రెండూ దుప్పట్లే వాడుతుంది...''

రొట్టెలు తిఁటున్న చావు ఉన్నట్లుండి బయటకు పరిగెత్తి భొళ్ళున వాంతిచేసుకొంది.

''ఒసేయ్— నేను చెప్పలేదంటే—నేతెచ్చిన నూనెలో ఏదో కలిపారు. అందుకనా పిల్లలంతా వాంతులు చేసుకొన్నారు..."అన్నాడుగోపాలంగట్టిగా. చావు ఉక్రోషంగా లోపలి కొచ్చింది.

"ఇలా నూనె కల్తీచేస్తే వాళ్లనెవరూ శిక్షించరా?''

''ప్రభుత్వం వాళ్లదేనండీ బాబూ—ప్రజలదని పేరేగాని నిజంగా ప్రజలకూ ప్రభుత్వానికీ ఏమీ సంబంధంలేదు...''

గోపాలం బిందెలు తీసుకుని పంపు దగ్గరకెళ్ళిపోయాడు. నీళ్ళు తీసుకొచ్చే సరికి తెల్లారుజామున మూడయి

పోయింది. వెంటనే మిల్క్‌బాటిల్ తీసుకుని బూత్‌దగ్గరకు పరిగెత్తేడు.

తిరిగొచ్చేసరికి పూర్తిగా తెల్లారిపోయింది.

చావుకునికిపాట్లు పడుతోందల్లా కళ్ళు విప్పి చూసింది, ఏదోగొడవవిని. పెరట్లో ఆడా మగా, పిల్లా జెల్లా అంతా క్యూలో నుంచుని ఉన్నారు.

''మీ పెరట్లో ఆ 'క్యూ' లేమిటి?'' ఆశ్చర్యపోతూ అడిగింది.

''ఇదికూడా మీకు తెలీదా ? మా కాంపౌండ్‌లో అయిదు కుటుంబాలు అద్దెకుంటున్నాయి. అందరికీ ఒకే లెట్రిన్, ఒకే బాత్‌రూమ్. అంచేత ఆ 'క్యూ'లు ఏడింటివరకూ అలానే ఉంటయ్..."

"ఇంక నాకేం చెప్పకు...'' అంది చావు లేచి నుంచుంటూ.

"ఇక మనం పోదాం, పదండి— నా పన్లన్నీ అయిపోయినయి...'' అన్నాడు గోపాలం.

చావు ఓ నిముషం ఆలోచనలో మునిగిపోయింది.

"పిచ్చివెధవ! వీడేదో బ్రతికి ఉన్నానని అనుకొంటున్నాడుగానీ, రోజూ వీడనుభవించేది చావే! తన వెంబడి తీసుకెళ్తే రోజువారిచావునుంచి బ్రతికిబయటపడతాడు. వీడు చావుకావాలని ప్రార్థిస్తున్నాడు కాబట్టి—ఇక్కడే కలకాలం పడుండాలి. ఇంతకంటె పెద్దచావెక్కడాలేదు..." అనుకుని బుల్లెట్‌లాగా అక్కడినుంచి దూసుకు వెళ్ళిపోయింది.

''చావుగారూ!ఆగండి...ఆగండి... నేనూ వస్తాను...''అంటూ వెనుకే పరుగెత్తాడు గోపాలం. అయితే వీధిలోకొచ్చేసరికి—ఓ పందిపిల్ల కాళ్లకడ్డం పడటంతో దబ్బున పడిపోయాడు. చుట్టుపక్కలాళ్ళు పరుగుతోవచ్చి అతన్ని లేవదీశారు.

"చావు... నన్ను తీసుకెళ్ళకుండా—మోసంజేసి పారిపోతోంది ... పట్టుకోండి...'' అన్నాడు గింజుకొంటూ.

అతని భార్య ఏడుస్తూ వచ్చింది.

"నిన్నట్నుంచీ ఇదే వరస—ఎవరో ఉన్నట్లు పిచ్చిమాటలు—'' అందరూ కూడబలుక్కుని రిక్షామాట్లాడి పిచ్చాసుపత్రివేపు పంపించారు గోపాలాన్ని—

మర్నాడు పార్వతీ పరమేశ్వర్లు మబ్బుల్లో షికారు వెళ్తోంటే భూలోకం నుంచి "దేవా, నాకు చావుని ప్రసాదించు స్వామీ'' అన్నగొంతు అరిగిపోయిన రికార్డులా వినబడింది.

''నాథా! ఇది గోపాలం గొంతులానే ఉందే? ఇంకా అతనికి చావుని ప్రసాదించలేదా?''అంటూ అడిగింది పార్వతి.

''వాడు పిచ్చాడుట పార్వతీ—మతి స్థిరం లేదుట—అందుకని పిచ్చాసుపత్రిలో వేయించాను...'' అన్నాడు శివుడు.

ఆ జవాబు పార్వతికి నచ్చింది—ఎంచేతనంటే ఆవిడ మబ్బుల్లోఉంది—

కాని—గోపాలం పక్కింట్లోఉంటూ—అతననుభవించే నరకాన్నే అనుభవిస్తూ—అతను ఛస్తూన్న చావునే రోజూ ఛస్తూన్న—మనకెలా నచ్చుతుంది!